నిర్మాణం జరిగేనా?

- వాగుల సమస్య తీరేనా..
- నీటి ప్రవాహ ఉధృతికి తెగిన కల్వర్టులు
- ఏళ్లు గడుస్తున్నా చేపట్టని పనులు
- ఇబ్బందులు పడుతున్న ప్రజలు
- పట్టించుకోని పాలకులు, ప్రభుత్వం



ఫిల్లర్ గుంతలకే పరిమితమైన ఆర్. గార్లపాడు పెద్దవాగు

ఎర్రవల్లిచౌరస్తా: అలంపూర్ నియోజకవర్గంలోని పలు వాగులపై వంతెనలు సక్రమంగా లేకపోవడంతో ప్రజలు నిత్యం ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వర్షాకాలం ఆరంభమైతే చాలు వాగులు ఉప్పొంగి పారడం వల్ల పక్క గ్రామాలకు కూడా వెళ్లలేని దీన పరిస్థితి ఇంకా కొనసాగుతూనే ఉంది. అధిక వర్షాల వల్ల వాగులో నీటి ఉధృతి ఎక్కువైతే ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని దాటే రోజులు ఇంకా మారలేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వాగులపై వంతెనలు లేని కారణంగా గ్రామాల్లో ఎద్దైనా అత్యవసరం ఏర్పడితే ఊరు కూడా దాటలేని పరిస్థితి దాపురిస్తోందని ప్రజలు తెలుపుతున్నారు. తప్పని పరిస్థితుల్లో ఒకవేళ ప్రాణాలకు తెగించి వాగును దాటేందుకు ప్రయత్నిస్తే ప్రమాదాలబారిన పడటం ఖాయంగా మారింది. దీని వల్ల వర్షాకాలం మొదలైతే చాలు వాగులు ఉన్న చుట్టు పక్కల గ్రామాల ప్రజలు ఇబ్బందులను ఎదుర్కొవడం ఆనవాయితీగా మారింది. ఆయా గ్రామాల దగ్గర వాగులపై అవసరమైన చోట వంతెనలు ఏర్పాటు చేయాలని ప్రజా ప్రతినిధులు, అధికారులకు ఎన్నిసార్లు విన్నవించినా పట్టించుకోవడం లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా పాలకులు స్పందించి వాగులపై సకాలంలో వంతెనలను నిర్మించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

నియోజకవర్గంలో ఇదీ పరిస్థితి..

➢ ఇటిక్యాల మండలంలో ఆర్ గార్లపాడు నుంచి ఎర్రవల్లి వెళ్లే దారిలో పెద్దవాగు వర్షాకాలం ప్రారంభమైతే చాలు రోజుల తరబడి ఉధృతంగా ప్రవహిస్తోంది. బ్రిడ్జి నిర్మాణం ప్రారంభమై ఏళ్లు గడుస్తున్నా పనులు పూర్తి కాకపోవడంతో చుట్టు పక్కల గ్రామాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. పలు మార్లు వాగు ఉధృతి కారణంగా అత్యవసర సమయంలో చుట్టు పక్కల గ్రామాల ప్రజలు వాగును దాటేందుకు ప్రయత్నించి ప్రమాదాల బారిన పడ్డారు.

➢ అదేవిధంగా సాసనూలు నుంచి షేకుపల్లి, షేకుపల్లి నుంచి ఎర్రవల్లి, ఇటిక్యాల నుంచి చాగాపురం, ఉదండాపురం నుంచి ఎస్సీ కాలనీ, ఉదండాపురం నుంచి సాతర్లకు వెళ్లే దారిలో వాగులకు వంతెనలు లేకపోవడంతో ప్రజలు నిత్యం ఇబ్బందులకు గురవుతున్నారు.



వాగు నీటి ఉధృతికి ధ్వంసమైన సాసనూలు కల్వర్టు



అత్యవసర పరిస్థితుల్లో వాగును దాటేందుకు ప్రయత్నిస్తున్న ప్రయాణికులు (ఫైల్)

➢ మానవపాడు మండలంలో అమరవాయి నుంచి మానవపాడు, చెన్నిపాడు నుంచి పెద్ద పోతులపాడు, మానవపాడు నుంచి చెన్నిపాడుకు వెళ్లే దారిలో ఉన్న పలు వాగులు వర్షాల కారణంగా ఉప్పొంగుతూ రోజుల తరబడి పారుతున్నాయి. దీనివల్ల ఆయా గ్రామాల ప్రజలు వర్షాకాలంలో ఇతర గ్రామాలకు వెళ్లేందుకు వాగులు దాటలేక ముప్పుతిప్పలు పడుతున్నారు.

➢ ఉండవెల్లి మండలంలో పుల్లూరు నుంచి కలుగొట్లకు వెళ్లే దారిలో ఉన్న వాగు వర్షంపడితే చాలు విచ్చలవిడిగా ప్రవహిస్తుంది. గతంలో ఇట్టి వాగులో అనేక ప్రమాదాలు చోటు చేసుకున్నాయి. గతంలో వాగు పారడంతో కారు ప్రమాదానికి గురై గర్భిణి మృతి చెందింది. ఉండవెల్లి నుంచి చిన్న ఆముదాలపాడు, ప్రాగటూరు నుంచి మారమునగాల, బైరాపురం నుంచి బస్సాపురం వెళ్లే దారిలో వాగులు వర్షాల వల్ల పొంగి పొర్లుతున్నాయి.

➢ అలంపూర్ మండలంలో సుల్తానాపురం నుంచి జిల్లెలపాడుకు వెళ్లే దారిలో ఉన్న వాగు వర్షాకాలంలో ఉధృతంగా ప్రవహిస్తుంది. దీనివల్ల వర్షాకాలం రెండు గ్రామాల రాకపోకలకు అంతరాయం ఏర్పడుతుంది. దీనివల్ల చుట్టు పక్కల గ్రామాల ప్రజలు, రైతులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు.

➢ రాజోళి మండలంలో తుమ్మిళ్ల నుంచి మాన్‌దొడ్డి, ముండ్లదిన్నె నుంచి రాజోళి, అశోక్‌నగర్ క్యాంపు నుంచి తుమ్మిళ్లకు వెళ్లేదారిలోని వాగులు వర్షాకాలం ప్రారంభమైతే రోజుల తరబడి ఉధృతంగా ప్రవహిస్తాయి. వాగులను దాటేందుకు అష్టకష్టాలు పడుతున్నారు.

➢ వడ్డేపల్లి మండలంలో రామాపురం నుంచి వల్లూరు, జూలకల్ నుంచి జూలకల్ స్టేజీ, కొంకల నుంచి వడ్డేపల్లి, తనగల నుంచి వడ్డేపల్లి వెళ్లే గ్రామాల మధ్యలో ఉన్న వాగులు వర్షాకాలం ప్రారంభమైతే చాలు ఉధృతంగా ప్రవహిస్తాయి. దీనివల్ల ఆయా గ్రామాల ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు.

➢ అయిజ మండలంలో ఎక్లాస్‌పురం నుంచి దేవసబండ వెళ్లే దారిలో ఉన్న వాగు వర్షాకాలం ప్రారంభమైతే ఉప్పొంగి పొర్లుతుంది. దీనివల్ల ఏక్లాస్‌పురం, దేవనబండ గ్రామాలకు రోజుల తరబడి రాకపోకలకు అంతరాయం ఏర్పడుతుంది. పలుమార్లు వాగును దాటేందుకు వెళ్లి ఆయా గ్రామాల ప్రజలు ప్రమాదాలబారిన పడ్డారు.

➢ ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ఆయా గ్రామాల సమీపంలో ఉధృతంగా ప్రవహించే వాగులపై త్వరితగతిన వంతెనలు నిర్మించి ప్రజలు, రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరుతున్నారు.

వాగులపై వంతెన నిర్మించాలి..



మా గ్రామం నుంచి మండల కేంద్రానికి వెళ్లడానికి పలు వాగులపై వంతెనలు లేక వర్షాకాలంలో తీవ్ర ఇబ్బంది ఏర్పడుతోంది. గ్రామం నుంచి ఎర్రవల్లి చౌరస్తాకు వెళ్లే దారిలో నాలుగు వాగులు ఉన్నాయి. ఆయా గ్రామాల ప్రజలు, వాహనదారులు రాకపోకలకు ఇబ్బందిగా మారింది. అధికారులు స్పందించి వాగులపై త్వరితగతిన వంతెనలు నిర్మించాలి.

– బోయ రాజు, సాసనూలు

నత్తనడకన పనులు..



మా ఊరి సమీపంలోని పెద్ద వాగుపై బ్రిడ్జి నిర్మాణాన్ని చేపట్టి ఐదేండ్లు పూర్తయింది. పనులు నత్తనడకన సాగడంతో నేటి వరకు పూర్తి కాలేదు. పోయినసారి వర్షాలకు తాత్కాలికంగా ఏర్పాటు చేసిన మట్టి రోడ్డు కూడా వర్షపు నీటిలో కొట్టుకుపోయింది. దీనివల్ల వర్షాకాలంలో వాగు పొంగి పొర్లడం వల్ల గతంలో నెల రోజులు దాటడానికి రాలేదు. ప్రతి ఏటా వాగును దాటేందుకు తాత్కాలికంగా రోడ్డు వేసినా వరద నీటి వల్ల కొట్టుకుపోతోంది. ఉన్నతాధికారులు స్పందించి సమస్యను త్వరగా పరిష్కరించాలి.

– చిన్న వీరన్న, ఆర్ గార్లపాడు

ఉన్నతాధికారులకు విన్నవించాం..

గార్లపాడు దగ్గర బ్రిడ్జి నిర్మాణం పనులు ప్రారంభించి ఫిల్లర్ గుంతలను తీశాక వర్షాలు కురవడంతో పనులు పూర్తిగా ఆగిపోయాయి. ఫిల్లర్ గుంతలలో గుండ్లు ఉండడం వల్ల బ్లాస్టింగ్ చేయడానికి సమయం తీసుకుంటోంది. అంతలోపే వర్షాలు ప్రారంభం కావడంతో ఫిల్లర్ గుంతలు పూర్తిగా నీటితో నిండాయి. దీనికి తోడు జూరాల కాల్వ నుంచి నీరు నిరంతరం వాగులోకి రావడంతో పనులు చేయడానికి ఇబ్బందులు ఏర్పడ్డాయి. నియోజకవర్గంలోని ప్రజల విజ్ఞప్తి మేరకు అధికంగా పొంగిపొర్లే వాగులపై వంతెనలు నిర్మించాలని ఉన్నతాధికారులకు నివేదించాం. వారి నుంచి అనుమతులు రాగానే టెండర్లు వేసి నిర్మాణ పనులు ప్రారంభిస్తాం.

– మహేష్‌కుమార్, ఆర్‌అండ్‌బీ ఏఈఈ, అలంపూర్

క్లుప్తంగా

రక్తదాన శిబిరం విజయవంతం చేయండి

అయిజ: వాజ్‌పేయి జయంతి సందర్భంగా మండల కేంద్రంలో సోమవారం నిర్వహించనున్న రక్తదాన శిబిరాన్ని విజయవంతం చేయాలని రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా ఉపాధ్యక్షుడు తాహేర్ ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. బీజేపీ, రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వ హించనున్న రక్తదాన శిబిరానికి యువత అధి క సంఖ్యలో హాజరైన రక్తదానం చేయాలని కోరారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే లక్ష్యం



అలంపూర్: రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పని చేస్తామని బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు ఎంసీ కేశవరావు అన్నారు. అలంపూర్ చౌరస్తాలోని పార్టీ కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో జిల్లా అధ్యక్షుడు మాట్లాడుతూ రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలపై కసరత్తు చేస్తున్నట్లు తెలిపారు. పార్టీని క్షేత్ర స్థాయిలో బలోపేతం చేయడానికి రాబోయే స్థానిక సంస్థ ఎన్నిలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. మండలాల వారిగా త్వరలోనే సమావేశాలు నిర్వహించి నియోజకవర్గంలో 139 గ్రామాల్లో సర్పంచ్ అభ్యర్థులను బరిలో నిలుపుతామన్నారు. సమావేశంలో బీఎస్పీ నాయకులు యువరాజు, విజయ్, ప్రదీప్, దొరబాబు, శేఖర్ పాల్గొన్నారు.

డ్రైయినేజీలు నిర్మించండి



మానవపాడు: మండలంలోని గాంధీచౌక్ నుంచి ఎంపీడీఓ కార్యాలయం వరకు సీసీ రోడ్డు నిర్మించారు. ఈ సీసీ రోడ్డు నిర్మాణం గుండా పక్కన డ్రైయినేజీ నిర్మాణం చేపట్టాలని మండల ప్రజలు కోరుతున్నారు. చాలా రోజులుగా ఉన్నతాధికారులకు నివేదికలు ఇచ్చినా స్పందించడం లేదని ప్రజలు తెలిపారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి డ్రైయినేజీ నిర్మాణాలు చేపట్టాలని కోరారు.

పిచ్చి మొక్కలను తొలగించండి



మానవపాడు: మండలంలోని ఎంపీడీఓ కార్యాలయం పక్కనే ఉన్న గెస్ట్‌హౌస్ ముందు హరితహారంలో భాగంగా మొక్కలు నాటారు. ఈ మొక్కల చుట్టూ పిచ్చి మొక్కలు దర్శనమిస్తున్నాయి. ప్రతినిత్యం మండల స్థాయి అధికారులు, ప్రజలు నిత్యం తిరుతూనే ఉంటారు. పిచ్చి మొక్కలు పెరిగి, కంప చెట్లు దర్శనమిస్తున్నాయి. వాటిని తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.

విద్యుత్ స్తంభం తొలగించరూ..



మానవపాడు: మండలంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం కేంద్రంలోని కార్యాలయానికి వెళ్లే దారిలో విద్యుత్‌స్తంభం దర్శమిస్తోంది. సహకార కార్యాలయానికి వెళ్లే దారిలో మందు సంచులు, పర్టిలైజర్స్ తీసుకు వెళ్లేదారిలో విద్యుత్ స్తంభం అడ్డం వస్తుందని వ్యవసాయ అధికారులకు, విద్యుత్ అధికారులకు వినతిపత్రం అందించినా ఇంతవరకు చర్యలు తీసుకోలేదని తెలిపారు. ఇప్పటికైనా ఉన్నత అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని వ్యవసాయ సహకార శాఖ అధికారులు కోరుతున్నారు.

రేపు శ్రీదత్త జయంతి

ఆత్మకూర్: పట్టణంలోని సాయిబాబా మందిరం ఆవరణలోని శ్రీదత్త ఆలయం వద్ద మంగళవారం శ్రీదత్త జయంతి పూజా కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు ఆలయ కార్యదర్శి దివాన్జీ ప్రభాకర్‌రావు తెలిపారు. ఈ సందర్భంగా ఉదయం 5.30గంటలకు సుప్రభాతం, 6 గంటలకు కాగడహారతి, 6.45కు శ్రీవిఘ్నేశ్వర, శ్రీనందీశ్వర, శ్రీదత్తాత్రేయ, శ్రీసంతాన నాగదేవత, శ్రీజోతిర్లింగ, శ్రీరామ్‌పరివార్, శ్రీలక్ష్మీదేవి, శ్రీ షిర్డిసాయినాథులకు పంచామృతాభిషేకం, 9గంటలకు కావిడి ఉత్సవం, అర్చన, అష్టోత్తరం, 10.30గంటలకు శ్రీ దత్తయజ్ఞం, 12 గంటలకు హారతి, సాయంత్రం ధూపహారతి, సాయిభజన, పల్లకీసేవ, సేజారతి కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు.

బహుమతుల అందజేత



కేటీదొడ్డి: మండలంలోని చింతలకుంటలోని మౌలాలిసాబ్ ఉర్సు సందర్భంగా ఆదివారం సందెరాళ్ల పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా గెలుపొందిన వారికి జడ్పీటీసీ రాజశేఖర్, సర్పంచు సువర్ణమ్మ, బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ గోవింద్ రెడ్డి, సింగల్‌విండో డైరెక్టర్ రఘుకుమార్ శెట్టి పాల్గొన్నారు.

క్రిస్మస్ కానుకల పంపిణీ



శాంతినగర్: రాష్ట్ర ప్రభుత్వం క్రీస్తు సోదరులకు పంపిన క్రిస్మస్ కానుకలను కాంగ్రెస్ నాయకులు ఆదివారం పంపిణీ చేశారు. కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఎస్సీ సెల్ జనరల్ సెక్రటరీ దేవేంద్ర, అలంపూర్ నియోజకవర్గ కోఆర్డినేటర్ పచ్చర్ల కుమార్‌లు శాంతినగర్‌లో కాంగ్రెస్ పార్టీ క్యాంపు కార్యాలయంలో కొత్త దుస్తులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సంఘ కాపరులు, సంఘ పెద్దలు, క్రీస్తు సోదరులు, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

స్నేహితుడి కుటుంబానికి ఆర్థిక సాయం



ఉండవెల్లి: మండల కేంద్రంలోని గోపాల్ అనే వ్యక్తి గుండెపోటుతో మరణించడంతో బాధిత కుటుంబానికి 1995–96 నాటి పదో తరగతి స్నేహితులు రూ.20 వేలు ఆర్థిక సాయం అతని భార్య విజయలక్ష్మికి అందజేశారు. కార్యక్రమంలో స్నేహితులు ప్రభాకార్, సుధాకర్ రెడ్డి, బాలస్వామి, గోవర్ధన్, వెంకటేశ్వర్లు, నాగేందర్ ఉన్నారు.

ఏసు జననం గొప్ప సందేశం



నాటికను ప్రదర్శిస్తున్న సందేస్కూల్ విద్యార్థులు



అలంపూర్‌లో ముస్తాబైన ప్రార్థన మందిరం

గద్వాల: పరిశుద్ధాత్మ కుమారుడిగా యేసుక్రీస్తు జననం ప్రపంచ మానవాళికి శాంతి సందేశం ఇచ్చిందని, ఆ కరుణామయుడి జన్మదినం అందరికీ ఎంతో శుభదినమని పలువురు సందేశకులు తెలిపారు. క్రిస్మస్ సందర్భంగా ఆదివారం స్థానిక ఎంబీ మిస్సా చర్చిలో ప్రదర్శించిన 'క్రీస్తు జననం' నాటిక ఆకట్టుకుంది. స్వాగత నృత్యంతో పాటు వైవిధ్య ఆహార్యం, అభినయంతో పండగ ప్రత్యేకతను సండేస్కూల్ విద్యార్థులు ప్రదర్శన ద్వారా చాటి చెప్పారు. ఈ కార్యక్రమానికి జిల్లా కేంద్రంలోని క్రైస్తవులు పెద్ద సంఖ్యలో హాజరై నాటికను తిలకించా రు. ఈ నాటికలో మరియమ్మ, యేసేపు, దేవదూత, హేరోదురాజు, మంత్రి, జ్ఞానులు, గొల్లలు పా త్రధారులలో విద్యార్థులు నాటికకు జీవం పోశారు. క్రిస్మస్ తాత ఆకట్టుకున్నాడు. ఈ సందర్భంగా చ ర్చి కమిటీ చైర్మన్ కిష్టఫర్, పాస్టర్ చార్లెస్, కార్యదర్శి సైమన్, కోశాధికారి కులదీప్‌నయ్యార్‌లు మాట్లాడా రు. ప్రతి ఒక్కరూ యేసు చూపిన బాటలో నడుచుకొని సేవాభావాన్ని అలవర్చుకోవాలని సూచించారు.

క్రిస్మస్ వేడుకలకు ముస్తాబు

అలంపూర్: క్రైస్తవ సోదరుల పవిత్ర పండుగ క్రిస్మస్ పండుగ పర్వదినం రోజు ప్రత్యేక ప్రార్థనలకు చర్చిలు ముస్తాబయ్యాయి. విద్యుత్ దీపాలతో ప్రార్థన మందిరాలను అలంకరించడంతో శోభాయమానంగా మారాయి. పట్టణంలోని సంతోష్‌నగర్, సంతమార్కెట్ కాలనీల్లోని చర్చిలతోపాటు నియోజకవర్గంలోని ఆయా మండలాల గ్రామాల్లోన్ని చర్చిలను విద్యుత్ దీపాలతో అలంకరించారు. పలు ప్రాంతాల్లో క్రిస్మస్ వేడుకల సందర్భంగా క్రీడా పోటీలు నిర్వహిస్తున్నారు.

త్రైత సిద్ధాంత భగద్గీత ప్రచారం

అయిజ: త్రైత సిద్ధాంత ప్రబోధ సేవాసమితి హిందూ జ్ఞాన వేదిక బింగుదొడ్డి సభ్యులు ఆదివారం మండలంలోని చిన్న తాండ్రపాడులో త్రైత సిద్ధాంత అనుబంధ గ్రంథాలను ప్రజలకు అందజేసి భగవద్గీత గురించి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా బింగుదొడ్డి కమిటీ అధ్యక్షుడు లక్ష్మణ్ మాట్లాడారు. త్రైత సిద్ధాంత భగవద్గీత జ్ఞానం ద్వారా సమాజంలోని కులమతాలను రూపుమాపడానికి, ప్రజల మధ్యలో ఉన్న అసమానతలను తొలగించడానికి, సర్వమతాలకు దేవుడు ఒక్కడేనని, ప్రజల్లో దైవ భక్తిని పెంపొందించడానికి దోహదం చేస్తుందన్నారు. కార్యక్రమంలో బింగుదొడ్డి కమిటీ సభ్యు లు ఈరన్న, వెంకటేష్, రామచంద్ర, జయమ్మ, నరసమ్మ, పద్మమ్మ, జము లమ్మ పాల్గొన్నారు.





ఆహారం కోసం అన్వేషణ

ఈ చిత్రంలో గుంపులు గుంపులుగా కన్పిస్తున్న ఈ కొంగలు ఆహారం కోసం అన్వేషిస్తున్నాయి. పదుల సంఖ్యలో తెల్లని కొంగలన్నీ ఒక చోట చేరి విహరిస్తూ కన్పించాయి. వరి పొలంలో తిరుగుతూ సందడి చేశాయి. ఈ దృశ్యం గద్వాల మండలంలోని చెనుగోనిపల్లి గ్రామ శివారులో ఆదివారం 'సాక్షి' కెమెరాకు కన్పించింది.

– గద్వాల అర్బన్

ఘనంగా స్వామివారి పల్లకీసేవ



మయూర వాహనంపై ఊరేగుతున్న స్వామి



గట్టులో హనుమద్ వ్రతం నిర్వహిస్తున్న భక్తులు

మల్దకల్: ఆదిశిలా క్షేత్రమైన స్వయంభూ లక్ష్మీవేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా ఆదివారం స్వామి వారు మయూర వాహనంపై ఊరేగించారు. స్వామి వారికి అభిషేకాలు నిర్వహించి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయంలో హనుమద్ వ్రతం ఘనంగా నిర్వహించారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా ఆలయానికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ చైర్మన్ ప్రహ్లాదరావు, ఈఓ సత్యశ్చంద్రారెడ్డిలు ఏర్పాట్లు చేశారు. బ్రహ్మోత్సవాలను తిలకించేందుకు భక్తులు వివిధ గ్రామాలు, పట్టణాల నుంచి పెద్దసంఖ్యలో హాజరయ్యారు. కార్యక్రమంలో మధుసూదన్‌రెడ్డి, సీతారామిరెడ్డి, తిమ్మారెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, అరవిందరావు, బాబురావు, చంద్రశేఖర్‌రావు పాల్గొన్నారు.

గట్టు: పూసలపాడు ఆంజనేయస్వామి ఆలయంలో ఆదివారం హనుమద్ వ్రతం ఆలయ అర్చకులు ఘనంగా నిర్వహించారు. ఆలయానికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు చేశారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు, మహిళలు గ్రామస్తులు పాల్గొన్నారు.

గ్రామీణ యువతకు ఉచిత శిక్షణ

వనపర్తి టౌన్: స్వామి రామానంద తీర్థ గ్రామీణ సంస్థ రాష్ట్రంలోని గ్రామీణ నిరుద్యోగ యువత ఉచిత శిక్షణ, హాస్టల్, భోజన వసతి అందిస్తుందని ఇనిస్టిట్యూట్ డైరెక్టర్ పీఎస్ఎస్ఆర్ లక్ష్మి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ శిక్షణ పూర్తి వేసిన వారికి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామన్నారు. దీన్ దయాళ్ ఉపాధ్యాయ గ్రామీణ కౌశల్య యోజన (డీడీయూజీకేవై)తో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్నాయన్నారు. ఈ శిక్షణలో బేసిక్ కంప్యూటర్ (డేటా ఎంట్రీ ఆపరేటర్)కు ఇంటర్మీడియట్ పాస్, అకౌంట్స్ అసిస్టెంట్ (ట్యాలీ)కి బీకాం, కంప్యూటర్ హార్డ్‌వేర్ అసిస్టెంట్‌కు ఇంటర్మీడియట్, ఆటోమొబైల్, వీలర్ వీలర్ సర్వీసింగ్, సెల్‌ఫోన్, ఎలక్ట్రానిక్ వస్తువుల రిపేర్‌కు 10వ తరగతిలో ఉత్తీర్ణత సాధించాలని తెలిపారు. సోలార్ సిస్టమ్ ఇన్‌స్టలేషన్, సర్వీస్‌కు పదో తరగతి పాస్/ఐటీఐ ఉన్న వారు అర్హులని, 4నెలల శిక్షణ ఉంటుందని, ఎలక్ట్రీషియన్(డొమెస్టిక్)కు 10వ, తరగతి/ఐటీఐ ఉన్న వారికి ప్రాధాన్యత ఉంటుందని, 5నెలల కాలపరిమితితో శిక్షణ ఉంటుందన్నారు. 18–35ఏళ్లలోపు వారు, గ్రామీణ అభ్యర్థులు అర్హులని, చదువు మధ్యలో ఉన్న వారు అనర్హులు అని పేర్కొన్నారు. అర్హతల ఒరిజనల్ సర్టిఫికెట్లు, జిరాక్స్, పాస్‌పోర్ట్ ఫొటోలు, ఆధార్, రేషన్ కార్డులతో వచ్చే నెల 2న యాదాద్రి భువనగిరి జిల్లాలోని సంస్థలో హాజరు కావాలని కోరారు.

నిరుపయోగంగా క్రీడామైదానాలు

- మందుబాబులకు అడ్డాగా మారిన వైనం
- వినియోగంలోకి తేవాలంటున్న క్రీడాకారులు



కేటీదొడ్డి మండల కేంద్రంలో నిరుపయోగంగా ఉన్న క్రీడామైదానం

కేటీదొడ్డి: గ్రామీణ ప్రాంతాల్లోని యువతకు క్రీడల్లో ప్రోత్సాహించేందుకు గత బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రతి గ్రామంలో తెలంగాణ గ్రామీణ క్రీడాప్రాంగణాల ఏర్పాటుకు శ్రీకారం చుట్టింది. శారీరక దారుఢ్యం, మానసిక ఉల్లాసానికి తోడ్పడే విధంగా గ్రామీణ ఆట స్థలాలు నిర్మించేందుకు చర్యలు తీసుకుంది. ఇందులో భాగంగా గ్రామాల్లో ఉన్న ప్రభుత్వ స్థలాలను అధికారులు గుర్తించి ఉపాధి హామీ నిధులతో ఆ స్థలాల్లో క్రీడాప్రాంగణాలు నిర్మించారు. ఇప్పటికే దాదాపు అన్ని గ్రామాల్లో ప్రాంగణాలు పూర్తయ్యాయి. అధికారులు ప్రత్యేక చొరవ తీసుకుని పనులు పూర్తి చేయించారు. ప్రస్తుతం పూర్తి స్థాయిలో వినియోగంలోకి రావడం లేదని విమర్శలు వినిపిస్తున్నాయి. క్రీడాప్రాంగణాలు ముందుబాబులకు అడ్డాగా మారాయని పలువురు క్రీడాకారులు ఆరోపిస్తున్నారు. ఇటీవల రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం క్రీడాప్రాంగణాలపై దృష్టి సారిస్తుందా? లేదా అనేది ప్రస్తుతం చర్చనీయాంశంగా మారింది. మండలంలో 23 గ్రామ పంచాయతీలు ఉండగా అన్ని గ్రామ పంచాయతీలలో క్రీడా ప్రాంగణాలు ఏర్పాటు చేశారు. ఇందులో సగానికి పైగా వినియోగంలో లేవు. గ్రామాలకు దూరంగా, స్థలం ఎక్కడ ఉంటే అక్కడ బోర్డులు పెట్టారు. ఆడేందుకు ప్రాంగణాలు అనువుగా లేకపోవడంతో క్రీడాకారులు మైదానాలకు వెళ్లేందుకు ఆసక్తి చూపడం లేదు. దీంతో ప్రభుత్వ లక్ష్యం నీరుగారుతోంది.

క్రీడాకారులను ప్రోత్సహించేందుకు..

క్రీడా ప్రాంగణాలను ఎకరం స్థలంలో నిర్మించాలనే ప్రతిపాదనలున్నాయి. కానీ గ్రామాల్లో స్థలం కొరతతో ప్రతిపాదనలను కుదించారు. 10 కుంటల నుంచి స్థలాలను అధికారులు గుర్తించి నిర్మాణాలు చేపట్టారు. అందులో తోరణం, ఖోఖో, కబడ్డీ, వాలీబాల్, పిల్లర్ల కోసం స్థలాన్ని చదును చేసేందుకు స్థలాన్ని బట్టి మరిని నిధులు మంజూరు చేసినా బిల్లులు అందలేదు. వాకింగ్ ట్రాక్‌ను ఏర్పాటు చేయాల్సి ఉండగా ఎక్కడా ఆ దిశలో చర్యలు చేపట్టలేదు. కొందరు రైతులు ధాన్యం ఆరబెట్టేందుకు క్రీడా మైదానాలను వాడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు చొరవ తీసుకుని క్రీడా ప్రాంగణాలను వినియోగంలోకి తీసుకురావాలని ఆయా గ్రామాల్లోని క్రీడాకారులు, ప్రజలు కోరుతున్నారు.



క్రీడా ప్రాంగణంలో మద్యం సీసాలు

వినియోగంలోకి తేవాలి..



ప్రభుత్వం మంచి లక్ష్యంతో ఏర్పాటు చేసిన క్రీడాప్రాంగణాలలో సరైనా ఏర్పాట్లు లేవు. గ్రామాలకు దూరంగా నిర్మించడంతో ఎవరూ పట్టించుకోవడం లేదు. గ్రామీణ ప్రాంతాల్లో క్రీడలు కనుమరుగు కాకుండా ఏర్పాటు చేసిన క్రీడామైదానాలకు కంచె వేసి కాపాడాలి.

– అశోక్, యూత్ సభ్యుడు, కేటీదొడ్డి

కిట్లు పంపిణీ చేశాం..

గ్రామాల్లో క్రీడా ప్రాంగణాలను ఏర్పాటు చేశాం. గ్రామాల్లో ఎక్కడ ఇబ్బందులు లేకుండా క్రీడామైదానాలు నిర్మించాం క్రీడాకారులకు సంబంధించిన కిట్లను కూడా ఆయా గ్రామ పంచాయతీల సర్పంచులకు అందజేశాం. కొండాపురంలో మాత్రం కోర్టులో కేసు ఉండటంతో కిట్టు అందజేయలేదు. క్రీడాకారులకు మైదానాలపై అవగాహన కల్పిస్తాం.

– సయ్యద్‌ఖాన్, ఎంపీఓ, కేటీదొడ్డి